క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం

పెద్దాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ మండలాల నుంచి ఏడు అర్జీలు అందాయన్నారు. ఇందులో ప్రధానంగా పెద్దాపురం 14వ వార్డు వరహాలయ్యపేటలో పారిశుధ్య సమస్య, భూ సమస్య పరిష్కరించాలని, సర్వే చేయాలని, ఆక్రమణలు తొలగించాలని తదితర సమస్యలు వచ్చాయన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఎల్‌పీఓ బాలామణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి

సామర్లకోట: వేతన ఒప్పందం ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ యాజమాన్యం స్పందించడం లేదని స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో పని చేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ 35 ఏళ్లుగా డిపోలో కార్మికులుగా పని చేస్తున్న వారికి పీఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరుతూ మంగళవారం చలో విజయవాడకు పిలుపు ఇచ్చామన్నారు. ప్రతి ఏడాది కూలి రేట్లు పెంచే విధంగా కార్పొరేషన్ ఒప్పందం ఉన్నా, దానిని అమలు చేయడం లేదని ఆరోపించారు. హమాలీస్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కొండలరావు, డిపో హమాలీస్ సంఘ అధ్యక్షుడు బి.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి వి.అప్పలరాజు, సంఘ గౌరవ అధ్యక్షుడు బాలం శ్రీనివాసు, సీఐటీయూ ప్రతినిధులు అమలకొండ సోమేష్, వెన్నెల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 15 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 260 మంది పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 245 మంది హాజరైనట్టు ఆయన వివరించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్టు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కాకినాడ రూరల్: ఎస్.అచ్యుతాపురానికి చెందిన పైడా సుబ్బారావు (64) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. ఐదేళ్ల క్రితం ఆపరేషన్ చేయించుకున్న సుబ్బారావు అధికంగా మద్యం తాగుతుండడంతో ఆదివారం రాత్రి భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురై అర్ధరాత్రి సమయంలో టర్పంటాయిల్‌ను ఒంటిపై వేసుకుని నిప్పు పెట్టుకున్నాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను నాగమల్లితోట జంక్షన్ వద్ద ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు భార్గవ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

కరప: పాన్ షాపు పైకప్పుపై పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొంగోడులో జరిగింది. కరప పోలీసుల కథనం ప్రకారం.. కొంగోడు గ్రామానికి చెందిన మేడిశెట్టి రమణయ్య (42) కూలి పనిచేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రమణయ్య సోమవారం ఉదయం అదే గ్రామంలోని చింతా బూరయ్య పాన్ షాపు పునర్నిర్మాణ పనికి వెళ్లాడు. ఐరన్ రాడ్లతో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగకు తగలడంతో విద్యుదాఘాతం సంభవించి, కింద పడిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రమణయ్యను చికిత్స నిమిత్తం గొల్లపాలెం హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యుడు ధ్రువీకరించాడు. ఈ మేరకు మృతుడి భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

తుని రూరల్: పాస్టర్స్ ఫెలోషిప్ తుని పట్టణ, మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని కుమ్మరిలోవ బెతెస్త ప్రార్థన మందిరంలో సోమవారం సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా పాస్టర్ కె.జాషువ ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా జి.ఆనంద్‌కుమార్, కార్యదర్శిగా జి.వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా కె.జాషువ ముల్లర్, కోశాధికారిగా ఎం.సుదర్శన్, సహాయ కోశాధికారిగా జాన్ థామస్, కార్యవర్గ సభ్యులుగా పాస్టర్లు కేజే జాషువ, కె.నతన, కె.స్టివెన్‌రాజు, టి.సాల్మన్, ఎస్.రాజు ఎన్నికయ్యారు.

అల.. ప్రగతి పథంలో..

- అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న గ్రామాలు
- గోర్సలో రూ.60 లక్షలతో పనులు
- ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెలు ప్రగతి బాట పట్టాయి. మండలంలోని పలు గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసుతులు కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలతో సతమతమయ్యేవి. గత పాలకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేయడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల రూపురేఖలు మారాయి. తమ కష్టాలు తీరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గోర్సలో ముస్తాబైన రైతు భరోసా కేంద్రం



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుకు కొలతలు వేస్తున్న అధికారులు



జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్

గోర్సలో అభివృద్ధి పనులు

మండలంలోని గోర్స గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, పంచాయతీ, మండల పరిషత్ నిధులు సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పటికే ప్రధాన రహదారుల్లో మురుగు సమస్యను పరిష్కరించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రత్యేక పైప్‌లైన్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. మాదాలమ్మ ఆలయ సమీపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిధులు రూ.8 లక్షలతో గౌడ, పద్మశాలీ కమ్యూనిటీ భవనం నిర్మిస్తున్నారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ.65 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు చేపట్టారు.



రూపుదిద్దుకున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం. గత టీడీపీ ప్రభుతం హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప గ్రామాల్లో జరిగిన అభివృద్ధి శూన్యం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. గోర్స పంచాయతీలో రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు.

– రొంగళ వీరబాబు, సర్పంచ్, గోర్స

తాగునీటి సమస్య తీరింది



ఇంటింటికీ కుళాయి ఇవ్వడంతో గ్రామస్తులకు తాగునీటి సమస్య తీరింది. గతంలో సరైన రోడ్లు లేకపోవడంతో ఇబ్బంది పడేవాళ్లం. వర్షాకాలంలో ఇబ్బందులు తీవ్రంగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో రోడ్లు, డ్రైన్లు వేయడంతో మా కష్టాలు తీరాయి. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మా ఇబ్బందులు తొలిగిపోయాయి.

– బెల్లపుకొండ రమాదేవి, గోర్స

నేడు నాగులపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. గత నెల 29న అధికారుల సమావేశం ఏర్పాటు చేయగా ఆర్డీఓతో పాటు పోలీసు అధికారులు హాజరు కాలేదని చెప్పారు. ఆలయానికి బదిలీపై వచ్చిన ఈఓకు ఉత్సవాలు కొత్త కావడమే కాకుండా, పోలీసు అధికారులు డీఎస్పీ, సీఐ, ఎస్సైలు కొత్తగా వచ్చారన్నారు. ఈ విషయంపై వారు భక్తులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. 8న మహాశివరాత్రికి సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆ దిశగా ఏర్పాట్లు ఉండాలన్నారు.

మాట ఇస్తే చేస్తారంతే..



తాటిపర్తిలో లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పట్టా అందజేస్తున్న దవులూరి దొరబాబు

- హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దొరబాబు

పెద్దాపురం: మాట ఇస్తే తప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరొందారని, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో సోమవారం నవరత్నాలు అందరికీ ఇళ్ల పథకంలో మంజూరైన రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌లతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గోపు మురళీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారుడికి సొంత ఆస్తిపై సర్వ హక్కులు కల్పిస్తూ పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అందజేస్తున్నామన్నారు. ఏటిపట్టు గ్రామాల్లో పది గ్రామాలకు పట్టణ శివారులో రామేశంమెట్ట వద్ద స్థలాలు ఇవ్వడం పట్ల కొంతమంది అనవసర రాద్ధాంతం చేశారన్నారు. అవే స్థలాలు ఇప్పుడు రూ.లక్షలు పలుకుతున్నాయని అన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నేతగా సీఎం జగన్ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని, అదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని దొరబాబు కోరారు. అనంతరం తాటిపర్తికి చెందిన 240 మంది లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలను ఆయన పంపిణీ చేశారు. అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, చదలాడ గ్రామ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, నాగబోయిన రాజబాబు, తలారి దొరబాబు, గోపు నల్లబాబు, అటపాకల గోవిందు, సుందరెడ్డి రాజు, కన్నయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

పెద్దాపురం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఆ హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి, తాటిపర్తి, చదలాడ, దివిలి, కట్టమూరు గ్రామాల్లో సోమవారం ఆయన ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. దీనిపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో నిబద్ధత కలిగిన నాయకులను ఎన్నుకోవడంలో ఓటర్ల పాత్ర కీలకమైందని అన్నారు. వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ ఓటు అనే వజ్రాయుధంతో ప్రతి పౌరుడూ మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగం, పోలింగ్ సరళి తదితర అంశాలపై అవగాహన కల్పించి, సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు. సర్పంచులు కురిమెళ్ల లోవరాజు, ఒబిలిశెట్టి అబ్బాయి, గోపు మురళి, శ్రీనివాస్, పుష్పరత్నం, సొసైటీ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, వేముల పండు, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం సదస్సులో ప్రసంగిస్తున్న ఈఓపీఆర్డీ రాజశేఖర్



కొత్తపల్లిలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



హుస్సేన్‌పురంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న పెద్దాపురం సీఐ రవికుమార్

ఎన్నికల నియమావళికి సహకరించండి

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల కోడ్ అమలుకు అంతా సహకరించాలని పెద్దాపురం సీఐ రవికుమార్ అన్నారు. వడ్లమూరు గ్రామంలో ఎన్నికల కోడ్, అమలు తీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ రాగానే కోడ్ అమలులోకి వస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనవసర విషయాల్లో చొరవ చూపి ఇబ్బందులు పడొద్దన్నారు. ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా అమలు చేస్తామని, ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కళ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, సతీష్, మహిళా పోలీస్ వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యం తెలుసుకోండి

సామర్లకోట: ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. సోమవారం హుస్సేన్‌పురం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మంచి నేతలను ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారా రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మార్ని నాగమణి అధ్యక్షత వహించగా, పంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీనివాసరావు, గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు ఎన్.శ్రీదేవి, పి.దుర్గాభవాని, ఆశ కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, ఎం.అంజలి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, వీవీఎస్ కళాశాలల్లో సోమవారం ఓటుహక్కుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎంపీడీవో వెంకటనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఈవీఎం, వీవీ ప్యాట్, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి మధ్యాహ్న భోజనం



పి.దొంతమూరులో మధ్యాహ్న భోజనానికి క్యూ కట్టిన విద్యార్థులు



సహపంక్తి భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

పిఠాపురం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ప్రాధాన్యం పెరిగిందనడానికి ఈ చిత్రాలే నిదర్శనం. గతంలో పాఠశాలల్లో అందరికీ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినా నాణ్యత లేకపోవడంతో కొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి తినేవారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేశారు. విద్యార్థులు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులందరూ పాఠశాలల్లోనే భోజనాలు చేస్తున్నారు. పిఠాపురం మండలం పి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక్కరు కూడా ఇంటికి వెళ్లకుండా పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. అది కూడా సహపంక్తి భోజనాలను తలపించేలా వరుస క్రమంలో కూర్చుని భోజనాలు చేయడం విశేషం. ఈ పాఠశాలలో 320 మంది విద్యార్థులు ఉండగా అందరూ బడిలోనే భోజనాలు చేస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం వి.వెంకటరెడ్డి తెలిపారు.

భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

సామర్లకోట: భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాక్ సిరామిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కల్లోల్ కుమార్ ఘెష్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలను సోమవారం స్థానిక రాక్ సిరామిక్స్‌లో ప్రారంభించారు. తొలుత భద్రత పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారాల్లో పనిచేసే సమయంలో ఎల్లప్పుడూ భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. హెడ్ హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్ టి.నీరజ్‌కుమార్, జనరల్ మేనేజర్ రాజిందర్ సింగ్‌మాన్, టైల్స్ హెడ్ వినోదపైక వాసుదేవ, శానిటరీ వేర్ హెడ్ చెల్ల దుర్గైలు మాట్లాడుతూ కార్మికులు మోటారు సైకిల్ నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఫ్యాక్టరీలో వారం రోజుల పాటు భద్రతకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. పర్చేజ్ హెడ్ వెంకటేశ్వరరావు, ఈహెచ్‌ఎస్ మేనేజర్ పి.బాలాజీ, పీఆర్వో వీజీఎస్ కుమార్ పాల్గొన్నారు.



సామర్లకోటలో భద్రతా వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతున్న నీరజ్‌కుమార్

కిటకిటలాడిన పంచారామ క్షేత్రం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచే రద్దీ నెలకొంది. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తెల్లవారు జామున పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలి అభిషేకం, పూజలు చేశారు. స్వామివారి ఆలయం, మూలవిరాట్, అమ్మవారి ఆలయాలతో పాటు ఉప ఆలయాలను పూలతో అలంకరించారు. ధ్వజస్తంభం మీదుగా ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి పాలు, చెరకు రసం, నీళ్లతో అభిషేకాలు చేశారు. ఆలయ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వేత్త అమలకంటి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన పూలతో సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లికి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్నలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత విద్యకు నమోదు చేసుకోవాలి

కరప: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. కరపలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. అర్హులు నేరుగా గాని, గ్రామ సచివాలయాలకు వెళితే ఉచితంగా నమోదు చేస్తారన్నారు. అర్హులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని, వారి పేర్లను వెబ్‌సైట్‌లో ఉంచుతామని, ఎమ్మార్సీ నుంచి కాల్‌చేసి తల్లిదండ్రులకు తెలియజేస్తారన్నారు. వికలాంగులు, షెడ్యూల్ కులాలు, బలహీన వర్గాలు, ఈబీసీ, అనాథలు, హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లలు అర్హులన్నారు. వీరికి ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయిస్తారని వివరించారు.

నేను సైతం 'సిద్ధం'



వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు గుర్రయ్యను అభినందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో వైఎస్సార్ సీపీ ప్రచార పర్వంలో దూసుకుపోతుండగా.. ఆ పార్టీ జిల్లా దివ్యాంగ విభాగ అధ్యక్షుడు ఒమ్మి గుర్రయ్య యాదవ్ నేను సైతం సిద్ధమంటూ ప్రచారం ప్రారంభించారు. సిద్ధం పేరిట తయారు చేసిన మూడు చక్రాల స్కూటీపై ప్రచారం చేస్తున్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బర్త్ డే వేడుకల్లో ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంత్రి దాడిశెట్టి రాజా తదితరులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఒమ్మి గుర్రయ్య యాదవ్ 'సాక్షి'తో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే తనకు అభిమానమని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. జిల్లాలోని దివ్యాంగులను జాగృతం చేసేలా తన మూడు చక్రాల వాహనానికి సిద్ధం పేరిట స్టిక్కరింగ్ చేసి ప్రచారం సాగిస్తున్నట్టు తెలిపారు.